# వాడు

వాడు మనిషే విచిత్రం... పేరూ చిత్రమే... శ్రావణమూర్తి. మేమందరం 'మూర్తి' అని పిలిచినా వాడు మాత్రం 'నేనురా... శ్రావణమూర్తినీ' అని దీర్ఘంగా, రాగం తీస్తున్నట్టు వ్యవహరించేవాడు. వాడిపేరుమీద, ఇంటిపేరుమీద, కుటుంబంమీద, వంశప్రతిష్ఠమీద వాడికి చిత్రమైన గర్వం కూడా ఉంది.

మేమంతా ఏలూరులో కలిసి చదువుకున్నాం. చదువులు పూర్తయ్యాక అందరిదీ తలో దారీ అయినా, ఉద్యోగరీత్యా ఐదారుగురు స్నేహితులం హైద్రాబాద్‌లో సెటిలయ్యాం.

అందరిలోకి శ్రావణమూర్తికి నాతోనే దగ్గరితనం ఎక్కువ. ఐదేళ్ళక్రితం అకస్మాత్తుగా ఓసారి ఏలూరునుంచి వచ్చాడు మూర్తి. వాడు కనపడగానే నాకెంతో సంతోషం. ఉత్సాహం కలిగాయి. ఒక రోజంతా మాట్లాడుకున్నా కబుర్లు తెమల్లేదు. చిన్నప్పటి విశేషాలు, పెద్దగా మార్పులు లేని తూర్పువీధి... చేటపర్రు వెళ్ళే దారి... ఆ ప్రాంతంలో కాపరం ఉండే మా పరిచయస్తుల కబుర్లు...

ఈ నగరం రొటీన్‌లో పడి, నిర్ధారణగా తెలియకుండానే

పడే విపరీత తాపత్రయం, ఏ మాత్రం నిజమైన తృప్తినివ్వని అనుభవాల దిగులుతో గడుపుతున్న నాకు శ్రావణమూర్తి కబుర్లు ఎంతో ఉపశమనంగా అనిపించాయి.

మర్నాడు ఆదివారం అవటం వల్లే కాక, మనసులో తలెత్తిన గట్టికోరిక వల్ల, ఊళ్ళో ఉన్న ఏలూరి మిత్రులుందరినీ పిలిచి మా ఇంట్లో సమావేశం పెట్టాను.

నగరం కరుణించినట్టుంది. ఆరోజు మిత్రులందరికీ ఆసక్తి కలిగిందో, మరే ఇతర పనులు అంత గొప్పగా అవసరం అనిపించలేదో, బద్ధకాన్ని జయించగలిగామో, అందం కలుసుకోగలిగాం.

ప్రధాన ఆకర్షణ శ్రావణమూర్తి, వాడి కబుర్లు. గంటా, గంటన్నరలో... పాతిక ముప్పై ఏళ్ళ జీవితాన్ని, కలిసి బతికే జీవితానందంనుంచి, ఎవరికివారైపోతున్న ఒంటరితనం వరకు. అమాయకమైన, హాయైన మా గత ఏలూరు జీవితం నుంచి ఇప్పటి నాగరికత నగర జీవితంలో నిజమైన బతుకు లేని గొప్పతనం వరకు ఎన్నో కబుర్లు...

ఆఖరికి, శ్రావణమూర్తే చెప్పాడు, తను నగరానికి ఎందుకు వచ్చాడో.

"మాది చాలా పెద్ద కుటుంబమని మీకు తెలుసుకదరా...అందరం పెద్ద ఇంట్లో కలకలలాడుతూ, ఎంత సందడిగా ఉండేవాళ్ళమో! అదంతా నిజమేనా అనిపిస్తుంది. అప్పటి ఆ అనుభవం అసలు ఈ జన్మదేనా అనిపిస్తోంది. అన్నీ కరిగిపోయాయి... ఆ ఇల్లూ లేదు... ఆ జనమూ లేరు. నేనూ, మా ఆవిడా మిగిలాం... మొన్నటిదాకా నేను పనిచేసిన వెలిశాల లక్ష్మణరావుగారి కొట్టూ మూతపడింది. మా ఆవిడే చిన్న కుట్టుమిషన్ పెట్టుకుని తంటాలు పడుతోంది. ఇంక అక్కడ ఉండటం కష్టంగా ఉందిరా... సిటీలో మీరందరూ ఉన్నారు. ఏదో దారి దొరక్కపోతుందా అని వచ్చాను..." అన్నాడు.

నాకే కాదు, మా వాళ్ళందరికీ తెలుసు. శ్రావణమూర్తివాళ్ళది జమీందారి కుటుంబం. మేం స్కూల్లో చదువుకునే రోజుల్లో రోజూ ఏదో ఒకటి ఇంట్లోంచి తీసుకొచ్చి, మా అందరికీ పెట్టేవాడు. ఏ ఖర్చయినా వాడే ముందుండేవాడు. మేం కాలేజీకి వచ్చేటప్పటికే వాళ్ళ కుటుంబంలో గట్టి ఆర్థిక ఒడిదుడుకులు ప్రారంభమయ్యాయి. అందరికీ సాయంచేసి చితికిన కుటుంబం శ్రావణమూర్తి వాళ్ళది.

"వచ్చేశావు కదరా... నా దగ్గరే ఉండు. నెమ్మదిగా ఏదో ఒకటి ఆలోచిద్దాం..." అన్నాను. వాడి సంతోషం అంతా ఇంతా కాదు. ఏ విషయాన్నైనా ఒకటికి, నాలుగు మాటలు చెప్పేతీరేమో, ఆ మాటతో నన్ను మిత్రుల మధ్య ఆకాశానికి ఎత్తేశాడు.

పదిరోజుల్లోనే శ్రావణమూర్తికి చిన్న ఉద్యోగం చూడగలిగాం. ఓ నెల పనిచేశాక, పనిచేస్తున్న చోటుకి దగ్గరగా చిన్న గదిలోకి మారాడు. కొత్తలో ప్రతి ఆదివారం తప్పనిసరిగా వచ్చేవాడు. ఆ తర్వాత, తర్వాత వాడి రాకపోకలు తగ్గాయి. ఏ మాత్రం వీలున్నా స్నేహితులు కబుర్లు లేకుండా ఉండలేని శ్రావణమూర్తిని కూడా నగరం మార్చేసిందిలే అనుకున్నాం.

ఆ తర్వాత మాకు తెలిసిన ఆశ్చర్యకరమైన విషయం, చేస్తున్న ఉద్యోగం వదిలేసి శ్రావణమూర్తి ఏలూరు వెళ్ళిపోయాడని. చెప్పా చెయ్యకుండా వెళ్ళిపోయాడే అనుకున్నాం. వాడి పద్ధతికి ఈ నగరం సరిపడదులే అని సరిపెట్టుకున్నాం. అయినా వాడు కూడా మాలాగే ఇక్కడ స్థిరపడితే బావుండేదేమో... అనీ అనుకున్నాం.

శ్రావణమూర్తి రావటం, వెళ్ళటం మేం మరిచిపోతున్న సమయంలో ఓ రోజు అకస్మాత్తుగా ఊడిపడ్డాడు. నేను ఆఫీసుకెళ్ళే హడావిడిలో నానా కంగారుగా ఉన్నాను. నాతోటే బస్‌స్టాప్ దాకా వచ్చాడు. ఆ అయిదు నిముషాల్లో వాడు పడ్డ హడావిడి అంతా ఇంతా కాదు. వీలున్నన్ని ఏలూరు కబుర్లు చెప్పాడు. ఎవరెవరి పిల్లలకి పెళ్ళిళ్లయ్యాయో, ఎవరు ఇళ్ళమ్ముకుని ఏలూరునుంచి వెళ్ళిపోయారో, మాకు తెలిసినవాళ్ళు ఎవరెవరు చచ్చిపోయారో చెప్పాడు. అన్నీ చెప్పి వాడి ఇబ్బందులు, ఏలూరు వదిలి బతకలేని తన బలహీనత చెప్పి ఓ వెయ్యిరూపాయలు కావాలన్నాడు. నేను ఇవ్వగానే అదేరోజు ఏలూరు వెళ్ళిపోతున్నానని చెప్పి వెళ్ళిపోయాడు.

ఓ రెండు నెలల తర్వాత మళ్ళీ వచ్చాడు. మళ్ళీ అదే ధోరణి. ఈసారి వెయ్యి ఇవ్వలేక, కొద్దిగా తక్కువగా ఇచ్చాను. మా ఏలూరు తూర్పు వీధిలోనే ఉండే పెద్దతలకాయలు ఓ ఇద్దరు చచ్చిపోయిన వార్త చెప్పి మరీ వెళ్ళాడు.

ఇలా ఓ ఏడెనిమిదిసార్లు శ్రావణమూర్తి వచ్చి వెళ్ళాడు. నా దగ్గరకే కాదు, వచ్చిన ప్రతిసారి మా స్నేహితులందరి దగ్గర ఇదే తంతు. వాడు అనుకున్న డబ్బు అందకపోతే ఒకటి రెండు రోజులు ఉండి మరీ తీసుకువెళ్ళేవాడు. స్నేహితుల్లో చాలామంది విసిగిపోయారు. శ్రావణమూర్తి అంటే చాలు తప్పించుకునే స్థితికి వచ్చారు.

ఆఖరికి నాకు తప్పలేదు. ఓసారి వాణ్ణి స్థిమితంగా కూచోపెట్టి పరిస్థితి అంతా వివరంగా చెప్పాను.

“ఒరే మూర్తి... ఈ సిటీలో ఎవడికి ఎంత డబ్బు వచ్చినా సరిపోవటం అంటూ సాధారణంగా ఉండదురా. అందులో మనస్థాయి మనుషులకి మరీనూ... మనవాళ్ళు నిన్ను తప్పించుకుంటున్నారు. అర్థం చేసుకో... నువ్వు ఖర్చులు తగలేసుకుని ఇలారావటం కన్నా, అవసరమైనప్పుడు నాకు ఫోన్ చేస్తూ ఉండు... నేను ఎంత పంపగలిగితే అంతా పంపుతాను” అన్నాను.

నా మాటలు విన్న మూర్తి ఒక్కమాట కూడా మాట్లాడలేదు. నాకూ మరింక మాట సాగలేదు. ఆ మర్నాడు పొద్దున్నే వెళ్ళిపోయాడు. అలా వాడు వెళ్ళి ఆర్నెల్లు దాటింది. వాడి సంగతేం తెలియక నాకూ దిగులుగానే ఉంది.

వారం రోజుల క్రితం వాడిగొంతు ఫోన్‌లో వినగానే ప్రాణం లేచొచ్చింది. “ఏరా మూర్తి ఎలా వున్నావు...” అన్నాను ఆత్రంగా...

"హైద్రాబాద్ వచ్చాను... నీ వీలుని బట్టి చెపితే... ఆ సమయంలో వచ్చి మాట్లాడతాను ఓ పదినిముషాలు..."

వాడిగొంతులో ఇదివరకటి గలగల లేదు. వెంటనే రమ్మన్నాను. వాడు వచ్చేలోపే నా ఆలోచన పదిరకాలుగా సాగింది. 'వీడు మళ్ళీ మా స్నేహితులందర్నీ డబ్బులడిగే మామూలు పద్ధతికి వచ్చేశాడా' అని అనిపించింది ఓ క్షణం.

శ్రావణమూర్తి వచ్చాడు. వాడు చెప్పినట్టుగానే సరిగ్గా పది నిముషాలే ఉన్నాడు.

"ఒరేయ్... నేను జీవితంలో తప్పులేం చేశానో తెలియదు. మిమ్మల్నందర్నీ... ఏలూరు వాళ్ళందర్నీ... నా స్నేహితులే కాదు... నా కుటుంబసభ్యులే అనుకున్నాను. ఏలూరంటే నాకు పిచ్చి... అలాంటిది అక్కడ నా జీవితం చితికిపోతే నా మరో కుటుంబం మీరనుకుని చొరవగా వచ్చాను. మీరేం చెయ్యగలరో అంతా చేశారు. దురదృష్టం నాదే. నేను ఇక్కడ ఉద్యోగంలో చేరినప్పుడే నా భార్య అనారోగ్యం పెరిగిపోయింది. చివరిదశలో ఆ అమాయకురాలికి దూరంగా ఉండలేక, తనని ఇక్కడికి తీసుకురాలేక వెళ్ళిపోయాను. నా దగ్గర డబ్బు ఉన్నప్పుడు ఎలా అందరం ఒక్కటే అనుకున్నానో, అలాగే నాడబ్బు ఇబ్బందుల్లోనూ అనుకున్నాను. ఇవ్వగలిగి ఇస్తున్నారనుకున్నాను. కానీ... ఇబ్బంది పడుతున్నారనుకోలేదు. ఒరేయ్... నా అవసరాల కోసం ఎప్పుడూ అబద్ధాలు చెప్పలేదురా... చావు వార్తలు కల్పించి చెబుతున్నానేమోనని మనవాళ్ళు అనుమానపడ్డారని విన్నాను... ఒట్టురా...ఏలూరు గురించి నేను చెప్పిన సంగతులన్నీ నిజమేరా. మనకి తెలిసున్న ఊరు, తెలిసున్న మనుషుల గురించి మీకు చెప్పాలి అన్నదే నా చాదస్తం... చాలామందికి ఈ రోజుల్లో ఒకరి గురించి మరొకరికి తెలియటం లేదురా... కిందటి నెలే నా జీవితభాగస్వామి, ఆ పిచ్చిదీ చచ్చిపోయింది... వస్తారా..." అన్నాడు.

బలవంతంగా డబ్బు ఇవ్వబోయినా తీసుకోలేదు. అంతే అలా వెళ్ళిన శ్రావణమూర్తి ఇంతవరకూ రాలేదు. కనీసం ఫోన్ కూడా చెయ్యలేదు.

ఏలూరు ఊరు ఊరంతా తన కుటుంబమే అనుకునేవాడు గుర్తొచ్చినప్పుడల్లా దిగులుగా ఉంటోంది.

మాకింక ఏలూరు విషయాలే తెలియవేమో! పుట్టి పెరిగిన ఊరుని మరిచిపోతూ, ఇంటిపేరునీ, కుటుంబ విలువలనీ మరిచిపోతూ, వంశం, జాతి, సంస్కృతి అన్న మాటల్ని నిత్యజీవితంలో దూరం చేసుకుంటూ... ఈ జీవితం... ఇలా ఆలోచిస్తూంటే శ్రావణమూర్తి విలువ ఎన్నో వందలరెట్లు అకస్మాత్తుగా పెరిగిపోతున్నట్టనిపించింది.

...నిజమే వాడిలాంటివాడు లేకపోతే చాలామందికి చాలా విషయాలు తెలియవు.

– సుజనరంజని – ఆంధ్ర సాంస్కృతికోత్సవ ప్రత్యేక సంచిక 2007